andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.6, కనిష్ఠం 19.5

నిర్మల్
జిల్లా వార్తలు
8
బుధవారం 21 ఫిబ్రవరి 2024

బీజేపీలో కొత్త జోష్



- జిల్లాలో సంకల్పయాత్ర సక్సెస్‌తో ఉత్సాహంలో బీజేపీ శ్రేణులు
- పార్లమెంట్ ఎన్నికలకు మోగిన ప్రచారా నగారా
- గెలుపు కోసం కేడర్ సమాయత్తం
- ముందస్తుగా సిద్ధమవుతున్న బీజేపీ

నిర్మల్/ భైంసా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ముందస్తుగానే సిద్ధమయ్యేందు కోసం గాను బీజేపీ పార్టీ పకడ్బందీగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగానే ఆ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన సంకల్ప యాత్రలకు మంగళవారం శ్రీకారం చుట్టారు. జిల్లాలో కొమురం భీం విజయ సంకల్పయాత్ర పేరిట ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువుల తల్లి పుణ్యక్షేత్రమైన బాసరలో ఈ సంకల్పయాత్ర రథానికి ఎంపీ సోయం బాపురావుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు పూజలు చేసి ప్రారంభించారు. అక్కడి నుంచి ఈ యాత్ర భైంసాకు చేరుకుంది. భైంసాలో నిర్వహించిన బహిరంగసభలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత భిశ్వ శర్మతో పాటు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, బీజేఎల్పీ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల శంకర్, జిల్లా అధ్యక్షులు అంజు కుమార్ రెడ్డి తదితరులంతా హాజరయ్యారు. ఈ సందర్భంగా అస్సాం సీఎం భిశ్వశర్మ మాట్లాడుతూ కార్యకర్తలను ఉత్తేజిత పర్చారు. ముఖ్యంగా రాబోయే ఎన్నికల కోసం కార్యకర్తలంతా సిద్ధం కావాలంటూ ఆయన కేడర్‌కు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శనాస్త్రాలను సంధిస్తూ కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆయన తన అనుభవాలను వెల్లడిస్తూ కష్టపడే వారికి బీజేపీలో గుర్తింపు లభిస్తుందంటూ తెలిపారు. నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంగా కృషి చేసి ఎన్నికల్లో గెలుపుకోసం పాటు పడాలని ఆయన కోరారు. అయితే సంకల్పయాత్రకు కార్యకర్తలు ఆశించిన రీతిలోనే హాజరవ్వడంతో ఆ పార్టీలో ఉత్సాహం నెలకొంది. ఇదిలా ఉండగా బీజేపీ ఇతర పార్టీల కన్నా ముందుగానే లోక్‌సభ ఎన్నికలకు సిద్ధమవుతుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈసారి ఆ పార్టీ ప్రధాని నరేంద్ర మోడీనే హైలెట్‌గా చేస్తూ ఆయన పదేళ్ల హయాంలోనే దేశంలో జరిగిన అభివృద్ధి, అమ లు చేసిన సంక్షేమ పథకాలనే ఈసారి ఏజెండా అంశాలుగా చేసుకుంటున్నారు. దీనికి అనుగుణంగానే బీజేపీ తన ప్రచార పర్వాన్ని కూడా చేపడుతోంది. జిల్లాతో పాటు ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లోని మొత్తం లోక్‌సభ నియోజకవర్గాల్లో ఈ సంకల్ప యాత్ర చేపట్టనున్నారు. భైంసాతో పాటు కల్లూర్, నర్సాపూర్, దిలావర్‌పూర్‌లలో జరిగిన రోడ్‌షోలు, జిల్లా కేంద్రంలో జరిగిన బహిరంగసభకు జనం భారీగా హాజరవ్వడంతో కాషాయ దళంలో ఉత్సాహం ఉరకలు వేస్తోంది. మొత్తానికి రాబోయే లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ చేపట్టిన ఈ సంకల్ప యాత్ర ఆ పార్టీకి మరింత ప్రయోజనం చేకూర్చనున్నట్లు చెబుతున్నారు.



కొమురం భీం విజయ సంకల్ప యాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ నేతలు

సంకల్పయాత్రకు మంచి స్పందన

బీజేపీ జిల్లాలో చేపట్టిన కొమురంభీం విజయ సంకల్పయాత్రకు మొదటి రోజు పార్టీ కార్యకర్తలనుంచే కాకుండా సాధారణ ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. బాసరలో యాత్రను ప్రారంభించిన అనంతరం భైంసాకు చేరుకుంది. ఇక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాగా ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభకు అస్సాం సీఎం హిమంత భిశ్వశర్మ హాజరుకావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. కాగా అస్సాం సీఎంకు రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్, ఎంపీ సోయం బాపురావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల శంకర్‌లు స్వాగతం పలికారు. వీరితో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు సైతం వీరిని ఆహ్వానించారు. అనంతరం జరిగిన బహిరంగసభలో పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు ప్రసంగించి కార్యకర్తలను ఆకట్టుకున్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి ప్రధాని నరేంద్రమోడీకి ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని బహుమానంగా ఇవ్వాలని ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు.

అస్సాం సీఎం సభ సక్సెస్

కాగా భైంసాలో బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన బహిరంగసభ సక్సెస్ కావడంతో ఆ పార్టీ కేడర్‌లో ఉత్సాహం నెలకొంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ముథోల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థి రామారావు పటేల్, నిర్మల్ నియోజకవర్గం నుంచి మహేశ్వర్‌రెడ్డిలు విజయం సాధించిన నేపథ్యంలోనే రాబోయే లోక్‌సభ ఎన్నికల సన్నాహక సభగా ఈ కార్యక్రమం జరగడం గమనార్హం. గత వారం రోజుల నుంచి పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామారావు పటేల్, పాయల శంకర్‌లతో పాటు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జనం ఆశించిన మేరకు బహిరంగ సభ కోసం హాజరుకావడంతో పార్టీ నేతలు సంబురపడ్డారు. కాగా అస్సాం సీఎం బిశ్వ శర్మ కార్యకర్తలనుద్దేశించి ఆసక్తికరంగా ప్రసంగించారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నేతలు, కార్యకర్తలు సమన్వయంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.


మోగిన ప్రచార నగారా

కొద్ది రోజుల్లోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలకానున్నట్లు ప్రచార జరుగుతున్న నేపథ్యంలో బీజేపీ నిర్వహించిన ఈ సంకల్పయాత్ర ప్రచార సభ ముందస్తు సన్నాహకాల్లో కీలకంగా మారనుంది. చదువుల తల్లి పుణ్యక్షేత్రమైన బాసర సరస్వతీ అమ్మవారి ఆలయం నుంచి ఈ సంకల్ప యాత్ర పార్లమెంట్ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని ప్రారంభించడం శుభ పరిణామం అంటున్నారు. బీజేపీ కూడా పూర్తిగా ప్రధానిమోడీ చేసిన అభివృద్ధి పనులను ఏజెండాగా చేసుకొని ఈ సంకల్ప యాత్రను కొనసాగించడం ప్రాధాన్యతను సంతరించుకుంటోందంటున్నారు. మొత్తానికి రాబోయే లోక్‌సభ ఎన్నికలను లక్ష్యంగా చేసుకొని బీజేపీ చేపట్టిన ఈ సంకల్ప యాత్ర ఈ పార్టీ గెలుపుకు దోహదపడుతోందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు.

హిందువుల మనోభావాలు గాయపరిచిన

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతిక హక్కు లేదు

- ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్



నిర్మల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని మెజారిటీ హిందువుల మనోభావాలను గాయపరిచిన కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే నైతికహక్కు లేదని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు కె.లక్ష్మణ్ అన్నారు. మంగళవారం నిర్మల్‌తో పాటు భైంసాలో నిర్వహించిన విజయ సంకల్పయాత్ర బహిరంగసభల్లో ఆయన మాట్లాడారు. 'అబ్ కీ బార్ చార్‌సౌ పార్' అనే నినాదంతో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల రణక్షేత్రంలోకి దూసుకుపోతోందన్నారు. ఈసారి ఎన్నికల్లో 400లకు పైగా పార్లమెంట్ సీట్లు సాధించి భారీ మెజారిటీతో మూడవసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. గత పదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందన్నారు.

లక్ష్మణ్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే ఏలేటి

నిర్మల్ కల్చరల్ : కొమురం భీమ్ సంకల్పయాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన బీజేపీ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌కు నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్వాగతం పలికారు. శాలువతో సన్మానించారు. నాయకులు మేడిసెమ్మె రాజు, అయ్యన్నగారి రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

తీస్రీ బార్ మోదీ సర్కార్ : ఎంపీ సోయం బాపురావ్



భైంసా : కేంద్రంలో ముచ్చటగా మూడో పర్యాయం ప్రధానిమోదీ నేతృత్వంలో బీజేపీ సర్కార్ ఏర్పాటు చేయడం తథ్యమని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావ్ పేర్కొన్నారు. భైంసాలో మంగళవారం జరిగిన బీజేపీ విజయ సంకల్పయాత్ర బహిరంగసభలో మాట్లాడారు. దేశ భవిష్యతు, రక్షణ, సంక్షేమం, సమృద్ధి కోసం మోదీ నాయకత్వం అత్యవసరమని అన్ని వర్గాల ప్రజానీకం ఆకాంక్షిస్తోందన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానాన్ని మరోమారు భారీ మెజార్టీలో కైవసం చేసుకొని ప్రధానిమోదీకి కానుకగా అందించేందుకు పార్టీ శ్రేణులన్నీ అంకితమవ్వాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదు

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



నిర్మల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : అబద్ధపు మాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎక్కువ కావడం నిలబడదని త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో రామరాజ్యం రాబోతోందని బీజేఎల్పీ నేతత ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మంగళవారం కొమురం విజయ సంకల్పయాత్రలో భాగంగా భైంసాలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ మాట్లాడితే బీఆర్ఎస్ పార్టీని విమర్శిస్తుందన్నారు. వారు ఇచ్చిన హమీలను నిలబెట్టుకోలేదనే ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారనే విషయాన్ని మరిచి వ్యవహరిస్తుందన్నారు. నిరంతరం బీఆర్ఎస్‌పై విమర్శలతో మాత్రమే సరిపెడుతున్న కాంగ్రెస్ పార్టీ తాము ఇచ్చిన హమీలను ఎప్పటి వరకు అమలు చేస్తుందో చెప్పడం లేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే డిసెంబర్ 9న రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు అసెంబ్లీలో నిలదీస్తే మా వద్ద డబ్బులు లేవని చెప్పడం కాంగ్రెస్ ద్వంద వైఖరికి నిదర్శమన్నారు. రాష్ట్రంలో 35 లక్షల మంది నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి యువత బుద్ధి చెప్పాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రధాని నరేంద్రమోడీకి కానుక పంపిద్దామని ఆయన పిలుపునిచ్చారు.

ముథోల్ నుంచి మెజార్టీ అందిస్తాం

- ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్



భైంసా, ఫిబ్రవరి 20 : పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానానికి ముథోల్ నియోజక వర్గ పరిధి నుంచి పార్టీకి భారీ మెజార్టీని అందిస్తామని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ అన్నారు. భైంసాలో జరిగిన విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభలో మాట్లాడారు. నియోజక వర్గ పరిధిలోని పార్టీ శ్రేణులు సమన్వయంతో వ్యవహరిస్తూ , సమిష్టిగా కృషి చేస్తూ అసెంబ్లీ మెజార్టీ కంటే పార్లమెంట్ ఎన్నికలో అధిక మెజార్టీ అందిస్తామన్నారు. విజయ సంకల్ప యాత్రను పురస్కరించుకొని బీజేపీ శ్రేణులు భైంసాలో భారీ బైక్ ర్యాలీ చేపట్టాయి.

బాసరలో బీజేపీ నేతల పూజలు

- అనంతరం విజయ సంకల్ప బస్సుయాత్ర ప్రారంభం


బాసర అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నేతలు

బాసర, ఫిబ్రవరి, 20 : బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని మంగళవారం బీజేపీ నాయకులు సందర్శించారు. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయానికి చేరుకున్న వారికి దేవస్థాన పండితులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మూడు ఉమ్మడి జిల్లాల్లో తలపెట్టిన విజయ సంకల్పయాత్ర బస్సును బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రం నుండి ప్రారంభించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు భైంసాలో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

నిబంధనల మేరకు పనులు చేయాలి : డీఆర్‌డీవో విజయలక్ష్మి



బహిరంగ విచారణ సభలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో విజయలక్ష్మి

భైంసా రూరల్, ఫిబ్రవరి 20 : ఉపాధి హామీ పథకంలో నిబంధనల మేరకు పనులు చేపట్టాలని, కొలతల్లో తేడాలుంటే ఉపేక్షించబోమని డీఆర్‌డీవో విజయలక్ష్మి అన్నారు. ఎంపీపీ అబ్దుల్ రజాక్ అధ్యక్షతన భైంసా ఎంపీడీవో కార్యాలయంలో 14వ బహిరంగ విచారణ మంగళవారం నిర్వహించారు. 30 గ్రామ పంచాయతీలకు సంబంధించిన పనులు, రికార్డులను పరిశీలించారు. 30 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం పర్యటించి ఏడాదిలో నిర్వహించిన ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ పనులను పరిశీలించారు. పనుల్లో అక్కడక్కడ చిన్న చిన్న తప్పులు దొర్లాయి. వారి నుంచి మొత్తం 13,849 రూపాయలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం'

ముథోల్, ఫిబ్రవరి 20 : అన్నివర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ముథోల్ మాజీ ఎమ్మెల్యే బి. నారాయణరావు పటేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన ముథోల్‌లోని ప్రజాప్రతినిధులత కలిసి సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అదేవిధంగా గ్రామంలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతుందని వెల్లడించారు. ముథోల్‌లో సుమారు రూ. 31 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

కరెంటు కోతను నిరసిస్తూ భైంసాలో రైతుల రాస్తారోకో

- ట్రాన్స్‌కో ఏఈపై చర్యకు డిమాండ్

భైంసా, ఫిబ్రవరి 20 : వ్యవసాయానికి కరెంటు కోతను నిరసిస్తూ భైంసా ప్రధాన రహదారిపై మండంలోని కథ్‌గాం గ్రామ రైతులు మంగళవారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామానికి ఇటీవల కాలంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. అయితే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాల్సిన ట్రాన్స్‌కో భైంసా రూరల్ ఏఈ రాంబాబు.. ఆందోళన చేస్తున్న రైతులతో దురుసుగా ప్రవర్తించారు. పంటలు ఎండిపోతే తామేమి చేయాలంటూ ఎదురు ప్రశ్నలు వేస్తూ.. రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ట్రాన్స్‌కో ఏఈ రాంబాబుపై చర్యలు తీసుకోవాలంటూ ఆందోళన చేశారు. సమాచారం అందుకున్న భైంసా రూరల్ సీఐ శ్రీనివాస్ ఘటన స్థలికి చేరుకొని రైతులను సముదాయించారు. ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించేలా చూస్తానని హామీ ఇవ్వడంతో.. కథ్‌గాం గ్రామ రైతులు శాంతించారు.


జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న కథ్‌గాం గ్రామస్థులు

ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్.. హాజరైన అధికారులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 : జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ, భూగర్భ, మైనింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సోన్, దిలావర్‌పూర్, సారంగాపూర్, లక్ష్మణచాంద మండలాల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతోందని అట్టి వారిపై ఉపేక్షించవద్దని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఇసుక అవసరం ఉన్నవారు తహసీల్దార్ల నుండి అనుమతులు తీసుకోవాలన్నారు. ధరణి, ప్రజావాణి, సీఎం ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలన్నారు. 27, 28 ప్యాకేజీలో భాగంగా భూసేకరణ వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో గంగయ్య, ఆర్డీవో రత్న కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

విజయ సంకల్పయాత్రలో 'ఇథనాల్' లొల్లి

- గొడవకు దిగిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు

దిలావర్‌పూర్, ఫిబ్రవరి 20 : బీజేపీ విజయ సంకల్పయాత్రలో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణం చిచ్చురేపింది. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య తోపులాటకు దారి తీసింది. ఒకరిపై ఒకరు దాడికి దిగారు. బీజేపీ శాసనసభ పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రసంగిస్తుండగా.. కాంగ్రెస్ కార్యకర్తలు మహేశ్వర్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంపై మాట్లాడే అవకాశం ఉన్నప్పటికీ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పెద్ద పెట్టున నినాదాలు చేయడంతో బీజేపీ కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మీదే కదా... పరిశ్రమను రద్దు చేసే అధికారం మీ చేతుల్లోనే ఉందని బీజేపీ కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ సందర్భంలో ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగి దాడి చేసుకునే వరకు వెళ్లింది. పోలీసులు వెంటనే అప్రమత్తమై ఇరు పార్టీల కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ ఒకరిపై ఒకరు దాడి చేసేందుకు ప్రయత్నించారు. డీఎస్పీ గంగారెడ్డి, సీఐ శ్రీనివాస్, పలువురు ఎస్సైలు ఇరు పార్టీల కార్యకర్తలను దూరంగా నెట్టి వేశారు.


ఇథనాల్ పరిశ్రమపై కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య వాగ్వాదం

ప్రత్యర్థులిద్దరూ ముచ్చట్లతో మురిసిపోయారు!

- ఒకే వేదికపై ఆదిలాబాద్ ఎంపీ సోయం, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



భైంసా, ఫిబ్రవరి 20 : బీజేపీ ఆదిలాబాద్ ఎంపీ టికెట్ కోసం హోరాహోరీగా తలపడుతున్న ప్రస్తుత ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌లు మంగళవారం ముచ్చట్లతో మురిసిపోయారు. నిన్నామొన్నటి వరకు ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో పాటు సవాళ్లు, ప్రతిసవాళ్లు విసురుకున్న నేతలిద్దరూ బేధాభిప్రాయాలకు తావులేకుండా ఒక్కటైపోయినట్లుగా మాట్లాడుకున్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలో జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్ర బహిరంగ సభ ఇందుకు వేదికైంది. బహిరంగ సభకు హాజరైన ఎంపీ సోయం, మాజీ ఎంపీ రాథోడ్‌లు వేదికపై పక్కపక్కనే కూర్చొని ముచ్చటించుకోవడం పార్టీ శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేసింది. పత్రిముఖంగా ఒకరిపై మరొకరు కామెంట్లు చేసుకుంటూ.. ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తేనే భగ్గుమనే రీతిలో వ్యవహరించిన నేతలిద్దరూ ఎలాంటి అరమరికలు లేకుండా కలిసిపోవడం విజయ సంకల్ప యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అందరి నోటా ఇదే చర్చగా మారింది.

సంక్షిప్త సమాచారం

బ్లడ్‌బ్యాంకును

పరిశీలించిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 : నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని బ్లడ్‌బ్యాంకును డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మిటపల్లి శ్రీధర్ మంగళవారం సందర్శించారు. ఎస్‌డీపీ డోనర్ లైసెన్స్ అనుమతిలో భాగంగా ఆయన సందర్శించినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

గుర్తు తెలియని వ్యక్తి మృతి



దిలావర్‌పూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని సిరాపూర్ వద్ద 61వ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు. కాగా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఆమె పేర్కొన్నారు. మృతుడి వయస్సు 30-40 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతి చెందిన వ్యక్తి బ్లూ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, బ్లాక్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు ఆమె పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు దిలావర్‌పూర్ ఎస్సై 87126 59517 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

అలేఖ్య హత్య కేసులో

ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయండి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 20 : ఇటీవల ఖానాపూర్‌లో దారుణంగా నడిరోడ్డుపై హత్యకు గురైన పెంబ్రెల్లి అలేఖ్య కేసు విచారణ వేగవంతం చేసేందుకు వెంటనే ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ పలువురు ప్రజాసంఘాల నాయకులు అలేఖ్య తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి జరిగిన తీరని నష్టంపై అలేఖ్య తల్లిదండ్రులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రేమోన్మాది చేసిన ఘాతుకానికి తమ కూతురిని కోల్పోవడమే కాకుండా కోడలు జయశీల పరిస్థితి సైతం విషమంగా ఉందని ఇప్పుడిప్పుడే గాయాల నుంచి చిన్నారి రియాన్స్ కోలుకుంటున్నాడని కలెక్టర్ వద్ద అలేఖ్య తల్లిదండ్రులు గంగవ్వ గంగారాం ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే హంతకుడు జూకింది శ్రీకాంత్, అతనికి సహకరించిన తల్లి, తమ్ముళ్లకు ఉరిశిక్ష వేయాలని వేడుకున్నారు. వారు బయటకు వస్తే తమ కుటుంబానికి ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలేఖ్య కుటుంబాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ఇవ్వడంతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని అఖిల పక్షం నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్షం నాయకులు నందిరామయ్య, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, నిట్ట రవి, నాగెల్లి నర్సయ్య, బిక్కి మురళీకృష్ణ, మునుగురి ప్రణీత్, మేష సతీష్, రాజు, తదితరులున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈవో ఆకస్మిక తనిఖీ

ఖానాపూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని ఎగ్బాల్‌పూర్, తర్లపాడ్, పాత తర్లపాడ్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఖానాపూర్ ఎంఈవో మధుసూదన్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.

బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా గంగారెడ్డి

బోథ్, ఫిబ్రవరి 20: రాష్ట్రంలోనే మొదటిసారిగా బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకపు ఉత్తర్వులు వెలబడ్డాయి. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొడ్డు గంగారెడ్డిని నియమించగా ఉపాధ్యక్షుడిగా నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆడే వసంతరావును నియమించారు. ఈ మేరకు మంగళ వారం ఉత్తర్వులు వెలబడ్డాయి. మొత్తం 18 మందితో కూడిన పాలక మండ లిని నియమించారు. అయితే సహకార సంఘం చైర్మన్ కుమారి సహకార సంఘం నుంచి సభ్యుడిగా తీసుకున్నారు.

'అనుమతి లేని పాఠశాలపై చర్య తీసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 : జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలకు ఉన్నత తరగతులకు అనుమతి లేకున్నా కొనసాగిస్తున్న యాజమాన్యం పైన, విద్యాధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఛాత్ర యువ సంఘర్షణ సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. అరవింద్ డిమాండ్ చేశారు. మంగళవారం పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. అనుమతులు లేకున్నా తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఫిర్యాదు చేశారు.

అప్‌డేట్ అవస్థలు!

- ఆధార్ అప్‌డేట్ కోసం సెంటర్ల వద్ద టోకెన్ల కోసం భారీ క్యూ
- గడువు పెంచాలని కోరుతున్న ప్రజలు



● ఫిల్టర్ బెడ్ ఆధార్ కేంద్రం వద్ద టోకెన్ల కోసం ప్రజల క్యూ

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20: జిల్లాలో ప్రజలకు ఆధార్ కష్టాలు తప్పడంలేదు. సంక్షేమ పథకాలకు ఆధార్ కార్డులను ప్రభుత్వాలు తప్పనిసరి చేయడంతో ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకోవడం కోసం జనాలు ఆధార్ కేంద్రాల ముందు బారులు తీరుతున్నారు పట్టణంలోని ఫిల్టర్‌బెడ్ ఆధార్‌నమోదు కేంద్రం వద్ద మంగళవారం తెల్లవారు జాము నుంచి టోకెన్ల కోసం ప్రజలు భారీ ఎత్తున క్యూకట్టారు. నిర్వాహకులు వారం చొప్పున వారికి టోకెన్లను అందజేస్తున్నారు. రేషన్‌కార్డు ఈకేవైసీ అనుసంధానం కోసం ఈనెల 29తో ముగి యనుండడంతో ఆ లోపు ఈకేవైసీ చేసుకో వడానికి ఆధార్ అప్‌డేట్ కోసం జనాలు బారులు తీరుతున్నారు. నమోదు కేంద్రాలు తక్కువ ఉండడం, అప్‌డేట్ చేసుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అప్‌డేట్ కోసం సమయం పడుతున్న నేపథ్యంలో ఈకేవైసీ గడువు పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక

బోథ్, ఫిబ్రవరి20: మండలంలోని నిగిని, కంటేగాం, బాబిర గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు మంగళవారం నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇంచార్జి మాట్లాడుతూ గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటిని దశలవారీగా నెరవేరుస్తుండడంతో పాటు ప్రజలకు నమ్మకం పెరిగి కాంగ్రెస్ పార్టీకి మరింత బలాన్ని ఇస్తుందన్నారు. సమీప భవిష్యత్తులో జరిగే పార్లమెంట్ ఎన్నికలలో మద్దతు ఇచ్చేందుకు పలు గ్రామాలనుండి నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. కంటేగాం, బాగారా గ్రామాల నుండి ఉపసర్పంచ్లు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చంటి, ఎంపీటీసీ కురమే మహేందర్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

'చేసిన పనులను బట్టి గుర్తింపు'

ఉట్నూర్, ఫిబ్రవరి20: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, విధుల్లో అందించిన సేవలను బట్టే గుర్తింపు లభిస్తుందని ఉట్నూర్ ఎంపీపీ పంద్రజైవంత్‌రావు అన్నారు. మంగళవారం ఉట్నూర్ నుంచి బదిలీ పై వెళ్తున్న ఎంపీడీఓ తిరుమల, ఎంపీఓ మహేశ్‌కుమార్‌లకు ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇద్దరు ఉద్యోగులుగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు సేవలు అందించారని అన్నారు. బదిలీపై వెళ్తున్న అధికారులు ఎంపీడీవో బోడ తిరుమల, ఎంపీవో మహేశ్‌కుమార్ మాట్లాడారు. తాము తమ ఉద్యోగ ధర్మాన్ని పాటించామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ శర్మ, ఎంపీఓ లింగయ్య, వైస్ ఎంపీపీ బాలాజి, కో ఆప్షన్ సభ్యుడు రషీద్, డిప్యూటీ ఈఈ పవర్‌రమేష్, ఈజీఎస్ ఏపీఓ రజినికాంత్, మోహన్‌సింగ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: ఎమ్మెల్యే



క్రీడాకారులకు ట్రోఫీని అందిస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ, ఫిబ్రవరి20: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మంగళవారం మండలంలోని బోరిగామ గ్రామ యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ బహుమతుల ప్రధాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ హాజరై ముందుగా గ్రామంలో ఉన్న జగదాంబ దేవి సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. అనంతరం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ క్రీడకారుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో ఇటువంటి టోర్నమెంట్‌లు దోహద పడుతాయని అన్నారు. కార్యక్రమంలో బోథ్ నియోజక వర్గ ప్రజా ప్రతినిధులు, నాయకులు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు పెద్దఎత్తున క్రీడాకారు లు, యువకులు హాజరయ్యారు.



బంగారం మొక్కు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

సమ్మక్క - సారలమ్మ సన్నిధిని దర్శించుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే

ఉట్నూర్, ఫిబ్రవరి 20: ఆదివాసీల ఆరాధ్య దేవతలు సమ్మక్క - సారలమ్మలను పంచాయతీరాజ్, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్కతో కలిసి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే బెల్లం (బంగారం)తో తులాభారం చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండి, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నట్లు తెలిపారు.

యువత లక్ష్య సాధనతో ముందుకెళ్లాలి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి20: భవిష్యత్తుపై ప్లానింగ్ లేక కొందరు వెనుకబడిపోతున్నారని, యువత లక్ష్య సాధనతో ముందుకెళ్లాలని హైదరాబాద్ ఐఏఎస్ అకాడమి డైరెక్టర్ విష్ణు అన్నారు. మంగళవారం ప్రభుత్వం సైన్స్ డిగ్రీకళాశాలలో డిగ్రీ, పీజీవిద్యార్థులు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ కొలువుల్లో ఎలా రాణించాలో వివరించారు. ప్రభుత్వ కొలువులే కాదు.. ప్రైవేట్ ఉద్యోగాలకు కూడా డిమాండ్ ఉందన్న విషయాన్ని గ్రహించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, కెరియర్ గైడెన్స్ సెల్ కో ఆర్డినేటర్‌డాక్టర్ నర్సింగ్‌రావు, బలూరి గోవర్ధన్‌రెడ్డి, ఐఏఎస్ అకాడమి రిసోర్స్ పర్సన్ విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

మహనీయులు చూపిన మార్గంలో నడవాలి

● మాజీ మంత్రి జోగురామన్న

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20: మహనీయులు చూపిన మార్గంలోనే అందరూ నడుస్తూ సమసమాజ నిర్మాణానికి పాటుపడాలని మాజీ మంత్రి జోగురామన్న అన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. పట్టణంలోని రాంలీలా మైదానంలో ఏర్పాటు చేసిన అధికారిక వేడుకలకు జిల్లా స్థాయి ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులతో పాటు పెద్ద సంఖ్యలో బంజారాలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగురామన్న మాట్లాడుతూ సేవలాల్ మహరాజ్ సందేశాలను మరింత ప్రచారం చేయాలని, సమాజం మరింత అభ్యున్నతి సాధిస్తుందన్నారు. మహనీయులు చూపిన మార్గంలో నడుస్తూ సమాజ హితం కోసం పాటు పడాలని కోరారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ మంత్రి జోగురామన్న

'ఉపాధిహామి పనులు కల్పించండి'

కుభీర్, ఫిబ్రవరి 20 : తమ తండా వాసులకు ఉపాధిహామీ పనులు కల్పించాలని మంగళవారం మండలంలోని సిర్పెల్లి ఫకీర్‌నాయక్ తండా వాసులు ఎంపీడీవో శ్రీనివాస్‌తో కోరారు. ఈ సందర్భంగా నాయకులు విజేయ్ జాదవ్ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనే పనులు కల్పించేందుకు ప్రభుత్వం ఉపాధి హామి పథకాన్ని ప్రారంభించిందని, ఐతే తమ తండాలో గత మూడు సంవత్సరాలుగా పనులు సక్రమంగా జరగకపోవడం కారణంగా కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమ తాండాలో జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రత్యేకాధికారి రాజేష్, ఏపీవో హరిలాల్ ఉపాధి పనులు కల్పించేందుకు సీనియర్ మెట్‌ను నియమించగా కొందరు తాండా వాసులు వ్యతిరేకించి తమకు ఫిర్యాదు చేయడం సరికాదని అన్నారు.

23 నుంచి ఎడ్‌బిడ్ మల్లన్న దేవుని జాతర

- జాతరకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- 24న చల్లని అంబళ్లు
- 26న కుస్తీ పోటీలు
- దేవుని కల్యాణం తర్వాతే గ్రామంలో పెళ్లి ముహూర్తాలు



జాతరకు ముస్తాబైన ఎడ్‌బిడ్ మల్లన్న దేవుని ఆలయం

ముథోల్, ఫిబ్రవరి 20 : నిర్మల్ జిల్లా ముథోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలో మల్లన్నదేవుని జాతర శుక్రవారం నుండి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ, గ్రామస్థులు తెలిపారు. ఈ జాతర 23వ తేదీ నుండి 27వ తేదీ వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ నెల 23న రాత్రి శ్రీ మల్లన్న దేవుని కల్యాణ మహోత్సవం, 24న చల్లని అంబళ్ళు 25న దేవుని పల్లకీ ఊరేగింపు, 26 కుస్తీ పోటీలు, రాత్రి అగ్నిగుండ ప్రవేశం, సుమారు రూ. లక్షలతో కుస్తీ పోటీలు నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుండి సైతం మల్లయోధులు తరలి వస్తారు. ఫైనల్ కుస్తీ పోటీల్లో ఫైనల్ విజేతకు 10 వేల నగదు, 50 గ్రాముల వెండి కడియం, రెండవ విజేతకు 5 వేల నగదు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. 27న ఆడపడుచుల జాతర, అంబలి కుండ ఇంటికి తేవడంతో జాతర ముగుస్తుంది. ఈ జాతరకు భైంసా నుండి ప్రత్యేక బస్సులు నడుపబడుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ గ్రామంలో ప్రతి సంవత్సరం దేవుని కల్యాణం జరిగిన తర్వాతనే గ్రామంలో పెళ్లి కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ జాతర ఉత్సవాలు ఆలయ కమిటీ, గ్రామ పంచాయతీ, గ్రామస్థులు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి : డీపీఎం సాయిప్రసాద్

ముథోల్, ఫిబ్రవరి 20 : స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగటానికి కృషి చేయాలని ఐకేపీ డీపీఎం సాయిప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని ఐకేపీ కార్యాలయంలో ముథోల్, తానూర్, బాసర మండలాలకు చెందిన వీవోఏలకు మంగళవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లక్పతి దీదీపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రతి ఒక్క మహిళా సంఘ సభ్యురాలు లక్పతి చేయడమే ఐకేపీ లక్ష్యమని పేర్కొన్నారు. సభ్యురాలు ఎంచుకొన్న జీవన ఉపాధిపై అవగాహన కల్పించి వారికి బ్యాంకు, గ్రామ సంఘం నుండి రుణాలు ఇప్పించి ఆదాయాన్ని పెంపొందించడానికి కృషి చేయాలని కోరారు. ఇందులో వీవోఏ, సీసీలు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ముథోల్, తానూర్ ఏపీఎంలు గురుచరణ్, నారాయణ్ రెడ్డి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

అధికారులను కలిసిన లారీ అసోసియేషన్ నాయకులు

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 20 : నిర్మల్ జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన డీటీవో దుర్గాప్రసాద్, ఆర్టీవో మహేందర్‌లను మంగళవారం నిర్మల్ లారీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వారసంత స్థలం

మార్చాలని వినతి

కుభీర్, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే వారసంత స్థలం మార్చాలని పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీవో, ఎస్సై, తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వేరువేరుగా గ్రామస్థులు అందజేశారు. ఈ సందర్భంగా నాయ కులు సాప పండరి, కందుర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్ యండ్‌బీ రోడ్డుపై వారసంత జరగడంతో అమార్గాన వెళ్లే వందలాది వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదని అక్కడే ఉన్న దేవాల యాలకు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లడం కష్టంగా మారుతోందన్నారు. అర్‌యండ్‌బీ రోడ్డుపై సంత జరగడంతో వచ్చే మండల వాసులకు కనీస అవసరాలు లేక తాగు నీటిసౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ వారసంతను గ్రామ నడిబొడ్డన ఉన్న గాంధిచౌక్ నుంచి అన్నబాహుసాటే కూడి వరకు కొనసాగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు తదితరులున్నారు.

రైతులకు కూరగాయల నారు అందజేత

ఖానాపూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని పాత తర్లపాడ్ గ్రామంలో ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వరయంలో రైతులకు టమాట, మిరప, వంకాయ లాంటి కూరగాయల నారును అందజేశారు. వేసవి కాలంలో కూరగాయల సాగు, సస్యరక్షణ, డ్రిప్పు, మల్చింగ్ పద్ధతులపై మంగళవారం గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని మిరప, వంకాయ క్షేత్రాలను సందర్శించారు. రైతులు జీవ ఎరువులను, జిగురు అట్టలను వినియోగించాలని ఈ సందర్భంగా పట్టు పరిశ్రమ, ఉద్యానవన శాఖ అధికారి మౌనిక సూచించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మణ్, ఫీల్డ్ ఆఫీసర్ చిన్నయ్య, రైతులు పాల్గొన్నారు.

'మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలి'

కుంటాల, ఫిబ్రవరి, 20: మహిళా సంఘాల బలోపేతానికి సిబ్బంది ప్రత్యేకంగా కృషి చేయాలని డీపీఎం విజయలక్ష్మీ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లూర్ గ్రామంలో లోకేశ్వరం , కుంటాల మండలాల మహిళా సంఘాల సభ్యులు, ఐకేపీ సిబ్బందికి లక్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు అంజుబాయి, అశోక్, మల్లేష్, సీసీలు, వీవోలు పాల్గొనగా డీపీఎం మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకొని విధానం, తిరిగి చెల్లించు విధానం, బ్యాంకు నుండి రుణాలు పొందే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళా లక్షపతి కావాలని ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఆమె పేర్కొన్నారు.

అనుమతులు లేకుండా
ర్యాలీ నిర్వహించవద్దు: ఎస్సై

బోథ్, ఫిబ్రవరి 20: ఎలాంటి అనుమతులూ లేకుండా ర్యాలీలు నిర్వహించవద్దని బోథ్ ఎస్సై రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ డీఎస్పీ వద్ద దరఖాస్తు చేసుకొని ర్యాలీలు నిర్వహించాలని పేర్కొన్నారు. రాజకీయ, మతపరంగా ర్యాలీలైనా అనుమతి తప్పనిసరని, లేనిపక్షంలో కేసులు తప్పవని పేర్కొన్నారు. అనుమతులు తీసుకునేవారు ముందుగా డీఎస్పీ ఆఫీసులో అనుమతి పొందాలని తెలిపారు.



పార్లమెంట్ టికెట్‌పై
ఎవరి ధీమా వారిదే!



- ఎవరికి వారు తీవ్ర ప్రయత్నాలు
- సిట్టింగ్ ఎంపీ, మాజీ ఎంపీల మధ్య మాటల యుద్ధం
- పట్టు నిలుపుకునేందుకు పార్టీ ప్రయత్నాలు
- నేడు జిల్లాలో విజయ సంకల్ప రథయాత్ర

ఆదిలాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ టికెట్‌పై తీవ్ర పోటీ నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్టీ నేతల మధ్యే విభేదాలు ముదిరాయి. బహిరంగంగానే ఒకరిపై ఒకరు ఆరోపణలకు దిగడం సర్వ సాధారణంగానే మారింది. జిల్లాలో ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్ నియోజకవర్గాలలో పార్టీ కొంత బలంగానే కనిపిస్తున్నా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్‌లోనే గెలిచి సత్తాచాటింది. మిగితా నియోజకవర్గాల్లో రెండు, మూడు స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందిన సోయంబాపురావును టార్గెట్ చేస్తూ కొంతమంది నేతలు అధిష్టానాన్ని తప్పు తోవ పట్టిస్తున్నారన్న ఆరోపణలు కూడా వెల్లువెత్తుతున్నాయి. అయితే ఎన్నికలు దగ్గర పడడంతో బీజేపీ పార్లమెంట్ ఎన్నికల శంఖారావాన్ని పూరించింది. ఇందులో భాగంగానే ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కొమురంభీం విజయ సంకల్పయాత్రను చేపట్టింది. నేడు జిల్లాలో బీజేపీవిజయ సంకల్ప యాత్ర ప్రారంభంకానుంది. నిర్మల్ జిల్లా నుంచి నేరడిగొండ మండలంలో ప్రవేశించి బోథ్, ఆదిలాబాద్, ఖానాపూర్ నియోజక వర్గాల మీదుగా బస్సు యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో పార్టీ అగ్రనేతలు పాల్గొని క్యాడర్‌కు దిశానిర్ధేశం చేయనున్నారు.

• బలనిరూపణకు ప్రయత్నాలు

పార్టీ అధిష్టానం చేపట్టిన విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేసేందుకు పార్టీ నేతలు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ జన సమీకరణతో నేతలు బలని రూపణకు ప్రయత్నాలు చేస్తున్నారు. నేరడిగొండ మండలం నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రం వరకు బస్సుయాత్ర కొనసాగే రోడ్డు మార్గంలో భారీగా ఫ్లెక్సీలు, బీజేపీ జెండాలను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్య నేతలు ప్రసంగించే మండల కేంద్రాలలో జనసమీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. సిట్టింగ్ ఎంపీతోపాటు ఆశావహ నేతలంతా విజయ సంకల్ప యాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నారు. నిర్మల్ జిల్లా భైంసా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్‌బాబు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, అభినవ్ సర్ధార్, శ్రీలేఖ పలువురు టికెట్ నేతలు కోసం ప్రయత్నాలు మొదలు పెట్టారు. అయితే టికెట్‌పై ధీమా ఉన్న నేతలంతా సోషల్‌మీడియాలో జోరుగా ప్రచారం చేసుకుంటున్నారు. బస్సుయాత్రలో భాగంగా జిల్లాకు వచ్చేఅగ్రనేతల దృష్టిని ఆకర్షించేందుకు పడరాని పాట్లు పడుతున్నారు.

• ముదురుతున్న వివాదం

సిట్టింగ్ ఎంపీ సోయంబాపురావ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ మధ్య వివాదం మరింత ముదురుతోంది. మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అసత్య ప్రచారం చేస్తున్నాడని ఎంపీ సోయం బాపురావ్ మండిపడ్డారు. స్వార్థ రాజకీయాల కోసం తనపై బుదర జల్లే ప్రయత్నం చేస్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. తనకు టికెట్ వచ్చిన రాకున్నా బీజేపీలోనే కొనసాగుతానంటూ స్పష్టంచేశారు. మళ్లీ నిరాధారమైన ఆరోపణలు చేస్తే తానెంటో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్‌కు చూపిస్తానంటూ బహిరంగ హెచ్చరికలు చేశారు. ఇద్దరు నేతల మధ్యమాటల యుద్ధం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికల వరకు పార్టీలో ఉండేదెవరో, వెళ్లిపోయేదెవరో అర్థం కానిపరిస్థితి ఉందంటూ చర్చించుకుంటున్నారు. నేతలంతా తమ రాజకీయ భవిష్యత్తుపై పక్కాప్లాన్‌తో ఉన్నారన్న టాక్ విన్పిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోనే నాలుగు శాసనసభ స్థానాలను గెలిచిన బీజేపీ మంచి ఊపులో కన్పిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో నేతల మధ్య అంతర్గత విభేదాలు పార్టీకి మంచిది కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

• మళ్లీ గెలిచేందుకు ఆరాటం

గత పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచినాబీజేపీ మళ్లీ సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకుని పట్టు నిలుపుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉండడంతో బస్సుయాత్రను చేపట్టింది. ఇందులో అన్ని నియోజక వర్గాలను చుట్టి వచ్చేలా పక్కాప్లాన్ చేస్తోంది. ఇప్పటికే నియోజకవర్గానికి 200 మంది ముఖ్యకార్యకర్తలను అయోధ్య దర్శనానికి ప్రత్యేక వాహనాలలో తరలించారు. విజయ సంకల్పయాత్రతో మరింత ఊపునిచ్చేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై విస్తృతంగా ప్రచారాన్ని కల్పిస్తున్నారు. కానీ గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నేరవేర్చిన దాఖలాలు కనిపించడం లేదు. జిల్లాలో ముఖ్యంగా సీసీఐ పరిశ్రమ పునరుద్ధరణ, ఎరోడ్రమ్ నిర్మాణంతోపాటు ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ పనులను చేపట్టాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే కొద్దిరోజులుగా రైల్వేలైన్ సాధన సమితి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపడుతున్నారు. వీటన్నింటినీ అధిగమించి మోదీ ఇమేజ్‌తో మళ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో గట్టెక్కే ప్రయత్నం చేస్తోంది.

• జిల్లాలో బస్సుయాత్ర ఇలా..

జిల్లాలో నేరడిగొండ మండలం నుంచి ప్రారంభమయ్యే విజయ సంకల్ప బస్సు యాత్ర బోథ్ నియోజకవర్గంలో కొనసాగనుంది. ఇచ్చోడ మండలంలో రోడ్‌షో నిర్వహించి పబ్లిక్ మీటింగ్‌లో కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పాల్గొని ప్రసంగిస్తారు. అక్కడి నుంచి గుడిహత్నూర్ మీదుగా ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకుని పట్టణంలో భారీ రోడ్‌షోను నిర్వహిస్తారు. అనంతరం పబ్లిక్ మీటింగ్‌ను ఏర్పాటు చేస్తారు. రాత్రి ఆదిలాబాద్‌లోనే బస చేసి గురువారం ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లో నిర్వహించే యాత్రలో సీనియర్ నాయకులు ఈటెల రాజేందర్ పాల్గొంటారు. కేస్లాపూర్ నాగోబా ఆలయాన్ని సందర్శిస్తారు. ఇంద్రవెల్లి, ఉట్నూర్ రోడ్‌షోల తర్వాత ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి బస్సు యాత్ర చేరుకుంటుంది.

ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వకుండానే జీవో

• మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి20: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ పనుల కోసం అనేక వినతులు ఇచ్చినా కేంద్రప్రభుత్వం పట్టించుకోలేదని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగురామన్న అన్నారు. ఆర్‌అండ్‌బీ ఎదుట రైల్వేలైన్ సాధన సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 36వ రోజుకు చేరుకోగా పార్టీ ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ఆర్మూర్ రైల్వేలైన్‌పనులు ఆగాయని బీజేపీ నాయకులు ఆరోపణలు చేస్తున్నారన్నారు. డిటెల్ ప్రాజెక్టు రిపోర్టు ఇవ్వకుండా కేవలం జీవోను విడుదల చేశారన్నారు. ఇది ఆదిలాబాద్ ప్రజలకు మోసం చేయడానికేనని ఆరోపించారు. ఎన్నికల సమయంలో జీవో ఇచ్చేసి తర్వాత దాని ఊసే తీయ్యలేదన్నారు. పఠాన్‌చెరు నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ కాకుండా ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వేలైన్ వేయాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు రైల్వేలైన్ సాధన దీక్షలకు తమ మద్దతు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సాధన సమితి చైర్మన్ నారాయణ, నాయకులు నరేందర్, అఫ్సర్, శోభతాయి తుల్జాపూరే, రైతు సంఘం అధ్యక్షుడు బండిదత్తాత్రి, బీఆర్‌ఎస్ నాయకులు నారాయణ, ప్రహ్లాద్ రోకండ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం

బోథ్, ఫిబ్రవరి 20: మండలంలోని కుచలాపూర్ గ్రామంలో ఈనెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న శబరిమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజున మనోహరాబాద్ ఆశ్రమ పీఠాధిపతి శివానంద భారతి హాజరయ్యారు. ప్రతిష్ఠాపనకు సంబంధించిన కార్యక్రమాన్ని ఆయన చేతుల మీద ప్రారంభించగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

• ప్రాజెక్టు డైరెక్టర్ సాయన్న


ప్రజా వేదికలో మాట్లాడుతున్న పీడీ సాయన్న

జైనథ్, ఫిబ్రవరి20: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకంలో గ్రామకార్యదర్శులు ఈజీఎస్ సిబ్బంది అవినీతి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదిలాబాద్ డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి.సాయన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన జైనథ్ రైతువేదికలో నిర్వహించిన 14వ విడత సామాజిక తనిఖీ వేదిక కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. గతవారం రోజులుగా ఎస్‌ఆర్‌పీలు డీఆర్పీలు గ్రామాల్లో జరిగిన ఈజీఎస్ తనిఖీలపై అధికారులు నాయకులు జీపీ కార్యదర్శులు ఈజీఎస్ సిబ్బందిపై గ్రామపంచాయతీల వారిగా ప్రత్యేక సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేయని కూలీలకు పనిచేసినట్లు మాస్టర్లు రాస్తేగాని ఈజీఎస్‌లో పంచాయతీ పనులు చేయకుండా చేసినట్లు ఉంటే వారిని విధుల నుంచి తొలగిస్తామన్నారు. గ్రామాలలో పల్లె ప్రకృతివనాల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించడంతోపాటు తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో అదనపు పీడీ కుటుంబరావ్, జైనథ్ ఎంపీపీ ఎం.గోవర్ధన్, జడ్పీటీసీ తుమ్మల అరుందతి వెంకట్‌రెడ్డి, ఏపీడీ కృష్ణరావ్, హెచ్‌ఆర్ మేనేజర్ రషీద్, ఎస్‌టీఎం నరేందర్, జైనథ్ మండల పరిషత్ అధికారి సాయినాథ్, అంబుస్‌పర్సన్ జి.వీణా, ఎంపీడీఓ వి.గజానన్ రావ్, ఏపీవో వెంకటరమణ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులున్నారు.

'గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే
గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదు'

తలమడుగు, ఫిబ్రవరి20: గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదని తలమడుగు జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రత్నపూర్ గ్రామంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ హామీలు తప్ప చేసిందేమీ లేదన్నారు. కేవలం పర్సంటేజీల కోసమే పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అనంతరం రత్నాపూర్ గ్రామంలో గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన సభలో పాల్గొన్న జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మీరాజేశ్వర్, గ్రామస్థుల విజ్ఞప్తి మేరకు రూ.5లక్షలతో కమ్యూనిటీ హాల్, రూ.3లక్షలతో పోచ్చమ్మ టెంపుల్, నిర్మాణం చేపడతామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఏపీఎం భాస్కర్, మాజీ జడ్పీటీసీ బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్‌రావు, ఎంపీటీసీలు మాధవ్, కమలాకర్, సి.రమేష్‌రెడ్డి, సోమన్న, కోఆప్షన్ బాబుఖాన్, తదితరులు పాల్గొన్నారు.


సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రారంభమైన రాములగుట్ట జాతర


గుట్టపై కొలువు దీరిన సీతారామ లక్ష్మణ విగ్రహాలు

తాంసి, ఫిబ్రవరి 20: మండలంలోని రాములగుట్టపై మంగళవారం నుంచి జాతర ప్రారంభమైంది. దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రతీయేడు ఫిబ్రవరి మాసంలో నిర్వహించే ఈ జాతరను ఈసారి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. 11 మంది వేదపండితుల మంత్రాలు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం మధ్య రాములోరికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా తెల్లవారు జామునగుట్టపై మహాయజ్ఞం ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ జాతర ఈనెల 24 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. ముగింపు రోజు రథోత్సవంతోపాటు మహాఅన్నదానం, రాములోరి కల్యాణం ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ వేదపండితుడు వీరయ్య పేర్కొన్నారు. ఈజాతర సందర్భంగా మహారాష్ట్రతోపాటు జిల్లా నలుమూలల నుంచే కాకుండా నిజామాబాద్, కరీంనగర్, నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరుకానున్నారు. వీరికోసం జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేకమైన బస్సును ఏర్పాటుచేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

'ఎల్బీనగర్‌లో విగ్రహ ప్రతిష్ఠాపనను విజయవంతం చేయాలి'

ఉట్నూర్, ఫిబ్రవరి 20: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్ లతీషా బంజారనగర్‌లో నూతనంగా నిర్మించిన అంజనేయ ఆలయంలో ఈనెల 24నుంచి జరుగనున్న విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమాలను విజయవంతం చేయాలని అభయాంజనేయ ఆలయకమిటీ అధ్యక్షుడు రాథోడ్ భీమ్రావు తెలిపారు. 24నుంచి 26వరకు కార్యక్రమాలకు జడ్పీ చైర్మన్ రాథోడ్‌నార్ధన్, ఎంపీ సోయం బాపురావ్, ఎమ్మెల్యేలు వెడ్మబొజ్జుపటేల్, కోవలక్ష్మి, జాదవ్ అనిల్, పాయలశంకర్, మాజీ ఎంపీ రాథోడ్‌రమేష్, మాజీ మంత్రి గోడం నగేష్, అజ్మీర్ రేఖాశ్యాంనాయక్, ఎంపీపీ పంద్రజైవంత్‌రావు, జడ్పీటీసీ చారులత రాథోడ్‌లు హాజరవుతున్నారని, విగ్రహ ప్రతిష్ఠాపన వేదపండితులు విశాల్‌శర్మ బృందం ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీటీవోను కలిసిన ఉద్యోగులు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20: వాణిజ్య పన్నులశాఖ ఆదిలాబాద్ సర్కిల్ సీటీవో (ఎఫ్‌ఏసీ), మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన నలినిమోహన్‌ను తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్‌గజిటెడ్ ఉద్యోగుల సంఘం ఆదిలాబాద్ డివిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీటీఓ(ఎఫ్‌ఏసీ), మేనేజర్ నలిని మోహన్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పై తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం ఆదిలాబాద్ డివిజన్ అధ్యక్షులు టి.హరికిషన్, కార్యదర్శి బి.సాయికృష్ణలతో పాటు అసోసియేటెడ్ ప్రెసిడెంట్ ఎంఏ అఖిల్, వైస్ ప్రెసిడెంట్స్ ఎస్‌కే. ఫహీం,సయ్యద్ అజారుద్దీన్, సీహెచ్‌ నీత, కె.అమోల్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.కృష్ణ, జాయింట్ సెక్రటరీ వి.ప్రవీణ, ఎస్‌కే మోబిన్ పాషా, సీహెచ్ సంజయ్‌సింగ్, ఏ.దేవన్న, ఆర్.హరిచరణ్, ట్రెజరర్ ఎం.దీపక్, పబ్లిసిటీ సెక్రటరీ ప్రణయ్ గౌడ్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.


నలినిమోహన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఉద్యోగులు

సంక్షిప్త సమాచారం

మొదలైన బ్రహ్మోత్సవాలు

భీంపూర్, ఫిబ్రవరి20: మండలంలోని పిప్పల్ కోటిలో వేంకటేశ్వర స్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాలు 22వరకు కొనసాగుతాయని, చివరిరోజు స్వామివారి కల్యాణం, మహా అన్నదానం ఉంటుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు పెంట నందయ్య తెలిపారు.

పాట్నాపూర్‌లో వాలీబాల్ పోటీలు

బోథ్, ఫిబ్రవరి20: ఈనెల 24, 25 తేదీల్లో మండలంలోని పాట్నాపూర్ గ్రామంలో రెండురోజుల పాటు వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు పాట్నాపూర్ చైతన్యయూత్ క్లబ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పోటీల్లో పాల్గొనే జట్లు 23 సాయంత్రంలోగా రూ.400 ఫీజుగా చెల్లించాలని పేర్కొంది.

నర్సులకు సన్మానం

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 20: ఉట్నూర్ మండలకేంద్రంలోని జిల్లాకేంద్ర ఆసుపత్రిలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో నర్సింగ్ ఆఫీసర్స్‌గా విధులు నిర్వర్తించే 17 మందికి పర్మినెంట్ ఉద్యోగాలు రావడం గర్వంగా ఉందని ఉట్నూర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్‌జాదవ్ ఉపేందర్ పేర్కొన్నారు. ఉట్నూర్ నుంచి వివిధ ప్రాంతాలకు రెగ్యూలర్ నర్సుగా వెళ్తున్నవారిని సన్మానించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ దుర్గంవిమల, సునిత, డా.కపిల్ రాథోడ్, నర్సింగ్ ఆఫీసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

నేరడిగొండ, ఫిబ్రవరి 20: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాజీవీర్ అన్నారు. మండలకేంద్రంలో మంగళవారం ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిప్రదేశంలో కూలీలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీందరికీ పనులు కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీవో వసంత్‌రావ్, పంచాయతీ కార్యదర్శి రాఘువ, ఎఫ్ఏ లత తదితరులున్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజ్‌వీర్


సేవాలాల్ చిత్రపటం వద్ద పూజలు నిర్వహిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో, మాట్లాడుతున్న కలెక్టర్ (ఇన్‌సెట్లో)



నృత్యాలు చేస్తున్న సంఘం సభ్యులు

సేవాలాల్ జీవితం అందరికీ ఆదర్శం

• కలెక్టర్ రాహుల్‌రాజ్ • ఘనంగా శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు • పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి 20: బంజారా కులస్తుల ఆరాధ్యదైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక రాంలీలా మైదానంలో ఏర్పాటుచేసిన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్‌రాజ్ ముఖ్యఅతిథిగా హాజరై బోగ్‌బండార్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీతాండాలో జన్మించారని, ఆయన జీవితం అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. హింస, మత్తు, దూమపానాలకు దూరంగా ఉండాలని హితవు పలికి యావత్ ప్రజానికానికి ఆదర్శంగా నిలిచారని, బంజార జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి అన్నారు. గిరిజనులకు ఆదర్శ ప్రాయుడు, దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మిక వేత్త అని, సమాజ శ్రేయస్సు కోసం సంత్ సేవాలాల్ చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. సేవాలాల్ మహరాజ్ తన బోధనల వల్ల బంజారా జాతి పురోగమించడానికి ఎంతో కృషిచేశారని, వారి అభివృద్ధికి, తండాల నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేసిన మహానుబావుడని ఆయన సేవలను కొనియాడారు. అనంతరం ఐటీడీఏపీఓ కుష్బుగుప్తా మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో పయనించి ఆయన ఆశయాలను కొనసాగించాలని కోరారు. చిన్నతనం నుంచే సేవాగుణం అలవర్చుకుని నలుగురికి సహాయపడే వారని, బంజారాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం ఎమ్మెల్యేలు పాయలశంకర్, జాదవ్ అనిల్, వెడ్మబొజ్జులు మాట్లాడుతూ సేవాలాల్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశారని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బోధించే వారని, ఆదర్శవంతమైన ఆయన జీవితాన్ని అందరూ ఆచరించాలన్నారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు జడ్పీ చైర్మన్ రాథోడ్‌జనార్ధన్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీవో ఐటీడీఏ ఖుష్బుగుప్తా, ఎమ్మెల్యేలు జాదవ్ అనిల్, వెడ్మ బొజ్జులు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు రాథోడ్ సురేష్‌నాయక్, జనరల్ సెక్రటరీ బానోత్ గజానంద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్


ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్